ప్రభుత్వం తప్పకుండా ఓడిపోతుంది - బైగాడ్ - దేవునిమీద ప్రమాణంచేసి చెప్తున్నాను. మనదేశములో పుష్కలంగా పండే మామిడి కాయలను మనం తినడానికి నోచుకోకపోతే వాట్ ఫరాల్ దిస్? ఈ పెట్టుబడి దారీ వర్గం మామిడి కాయల్దగ్గర్నుంచీ లారీలమీద పైకితోలేసి లాభాలు గడించేసి ఆఖరికి టెంకల్ని కూడా మన్ని కళ్ళజూడనివ్వకుండా వున్నారు. "కండ చీమలతో కారప్పిండి జల్లి తింటే చిప్పిలునే కవనధార" అన్నాడు విప్లవకవి. అసలు కారల్‌మార్క్స్ ఆవకాయ తినబట్టే "మార్క్స్ సిద్ధాంతము" అనేది కనిపెట్టి రాశాడు - అని నేననుకుంటున్నాను. మావోకూడా కనీసం బెల్లపావకాయైనా తినేవుంటాడు. మా వారికి ఆవకాయలేందే ముద్ద దిగదు. ఆయన వడగళ్ళలో చదివిన పాత పద్యం ఒకటి కోట్‌చేస్తూ వుంటారు. అదే నేను మళ్ళీ మీకు చెబుతున్నాను.

కలిపెడిది ఆవకాయట
కలిపించెడివాడు మేనమామట నే
కలిపిన భవహరమగునట
కలిపెద వేరొండు వాయ కలుపగనేలా!

(ఇది ఆదితాళం ఆనందభైరవిలో చివరిచరణం పాడుకోవాలి. లేక పోతే మీ యిష్టమొచ్చిన రాగంలో తాళంలో పాడుకోండి) ఈ ఆవకాయ మాహాత్మ్యంబను ఇల్లాలి ముచ్చట్లందు సర్వంబును సంపూర్ణంబు. ఇది చదవని వారికి చదివిన వారికి ఆయురారోగ్య ఐశ్వర్య భక్తిముక్తి ఫలప్రాప్తిరస్తు, ఆవకాయ పెట్టినా పెట్టకపోయినా వ్రతం చెడ్డా ఫలంతప్పదు. ఓం మంగళం మహత్. కళ్ళుమూసుగుని ముక్కుపట్టుకోండి. ఆవకాయ జాడీ కనిపిస్తోందా లేదా - అదీ - అద్దదీ - కళ్ళు తెరవకండి. ఆ భయంకరమైన రెక్కల చప్పుడేమిటి అంటున్నారా? గరుత్మంతుడు కద్రువ పిల్లలకు చద్దెన్నాలలోకి ఆవకాయ పట్టికెళ్లడానికి వస్తున్నాడు. ఈ జాడీ పట్టుకెళ్లి పినతల్లికిచ్చి తన తల్లికి దాస్యవిముక్తి కలిగించబోతున్నాడు. కాని యీ ఆవకాయజాడి కాద్రవేయులకు దక్కకుండా ఇంద్రుడువచ్చి చావగొట్టి లాక్కుపోతాడు.

ఇంద్రుడి వేషం ఎవరు వేశారు? గరుత్మంతుడి వేషం ఎవరు వేశారు అంటున్నారా? నాకు తెలీదండీ.

# నిచ్చెన బొప్పాయి చెట్టూ

మెట్లు...మెట్లు....మేడ మెట్లు... ఎన్ని మెట్లెక్కినా కానరావేమయ్యా అన్నాడు కవి. (అసలుంటే కద కనిపించటానికి) ఒక రూలుంది, దాన్ని మెట్ల రూలుఅనొచ్చు. ఎన్ని మెట్లెక్కేమో అన్ని మెట్లు దిగాల్సిందే (పైనుండి పోతేతప్ప) మనిషి ఎంత పైకైనా వెళ్ళిపోగలడుకాని అక్కడ మకాం వేసుకుని వుండిపోలేడు. కాని పైకి వెళ్ళాలంటే ఏంబిషనుండాలి. మేడమెట్లు లేకుండా

వున్న ఇళ్ళలో పెరిగిన పిల్లలకు ఏంబిషన్ వుండదుట. గోడలెక్కటం, చెట్లెక్కటం, ఇల్లెక్కడం యివేవీరాని పిల్లలు, జీవితంలో ఎందుకూ పనికిరారు. జీవితంలో బాగుపడటం అంటే ఒక రకంగా చెడిపోవటమే. నిచ్చెనవుందనుకోండి అది ఎక్కడానికి కట్టేరా, దిగడానికి – యిలాటి అనుమానాలు నాకు కోకొల్లగా వస్తుంటాయి. ఈ ఎగుడూ దిగుడూ జీవితంలో తప్పనిసర్లుకావచ్చు పలక సర్లులాగా.

మెట్లు ఎక్కడానికి పిల్లలు చాలా సంబరపడిపోతారు. చిట్టి చిట్టి పాపలుకూడా బుల్లిబుల్లి చేతుల్తో మెట్లమీద చేతులేసి ఎవరూ చూడకుండా వుంటే పైకి పొట్టతోనూ కాళ్ళతోనూ పాక్కుంటూ వెళ్లి కూర్చుంటారు. ఇళ్ళలో కుర్చీలను బల్లలను ఆసరాచేసుకుని కిటికీ వూచలను పట్టుకుని పిల్లలు పైకి ఎక్కుతారు. పిల్లలకు భయం వుండదు. పడినా ఒకఏడుపేడ్చి మళ్ళీ మళ్ళీ అవి ఇవీ ఎక్కటం మానరు.

మెట్లఫిలాసఫీకికూడా కొన్ని లిమిటేషన్లున్నాయి. మనం ఎక్కేమెట్లు ఇంకోరెవ్వరూ ఎక్కడానికి వీల్లేకుండా కట్టుదిట్టాలు చేసుకుంటూనే వున్నాము. గుళ్ళోమెట్లు ఎక్కచ్చు. మీయింటిమెట్లు అలా ఎక్కడానికి వీల్లేదే? అలా మీకు తెలియకుండా మీమెట్లు ఎక్కి మీకు తెలీకుండా మీ తలుపులు త్రోసుకుని లోపలకువచ్చే వారిని దొంగలంటాము. మన ఆలోచనామందిరంలోకి చెప్పా పెట్టకుండా వచ్చేవారిని కళాకారులంటాము. ప్రేమికుల్నీ, కళాకారుల్ని దొంగలుగా జమకట్టి గౌరవించటమో ఏదో ఒకటి చేస్తూంటాము. అంచాతే దేవుళ్ళకూ దొంగలకూ అట్టేతేడాలేదు. నందగోపాలుడు నవనీత చోరుడేకదా "మా చెల్వల మానధనమ్ము తెచ్చెనో మల్లియలార మీపొదలమాటున లేడుగదమ్మ చెప్పరే" అన్నాడు సహజ పాండిత్య బమ్మెర పోతనామాత్య. శ్రీకృష్ణుడైనాసరే యిప్పుడొచ్చి బజార్లో చీరెలు దొంగిలించమనండి, మీషాపులోకెళ్ళి వెన్న దొంగతనం చేయమనండి, మక్కెలు విరగ్గొడతారు, కాఫీత్రాగి, బిల్లివ్వకుండా హోటల్లోంచి బయట పడమనండి మురళీ ఫించెం గించెంలాక్కుని బయటకు తన్నిపంపిస్తారు. సొసైటీలో జీవించాలంటే దాని రూల్సన్ని చచ్చినట్లు పాటించితీరాలి. దేవుడిక్కూడా మనిషిలా జీవించాలంటే చచ్చేచావవుతుంది.

క్రిందినుంచి పైకిచూస్తే "అబ్బో అబ్బో అలాగా" అనిపిస్తుంది. పైనుంచి క్రిందకుచూస్తే "చీచీ ఏం మనుషులు ఏం జీవితం" అనిపిస్తుంది. నేలబారుగా జీవించటానికి ఎవరూయిష్టపడరు. కాని అందరూ పైకి వెళ్ళి పోవటానికి వీల్లేదుకదా. అందుచేత కొంతమంది ఆలోచనలు వున్నతంగానూ కొంతమందివి నేలబారుగానూ వుంటాయి. కొందరు తలుపులూ కిటికీలూ మూసుకు కూర్చుంటారు. కొందరిళ్ళలో తలుపుల్ని బార్లా తెరుచుకుని జీవిస్తారు. కొందరి జీవితాలు తెరిచిన పుస్తకాల్లావుంటాయి, కొందరివి మూసేసి అలమార్లో ఎత్తుగా పెట్టిన అందమైన మొరాకోబైండ్లు.

మనకు ఎక్కడపడితే అక్కడ అందమైన మెట్లు కనపడొచ్చుగాక అన్ని మెట్లూ అందరూ ఎక్కటానికికాదు. అన్ని చీరలూ అందరూ కట్టుకోటానికికాదు. అన్ని నవ్వులు అందరికోసం

కాదు. అన్ని తివాసీలమీంచి అందరూ నడవటానికి వీల్లేదు. అన్ని కుర్చీల్లోనూ అందరూ కూర్చోటానికి వీల్లేదు. అన్ని బ్యాంకులలోని డబ్బూ అందరిదీ కాదు. కొందరిదే? అన్ని అవకాశాలూ అందరికీ రావు కొందరికే!

నూతిలోకి దిగేమెట్లు గంభీరంగా వుంటాయి. తడితడిగాపాకుడు పాకుడుగా వుంటాయి. కాలవగట్లమీద జారుడు మెట్లు వుంటాయి. మెట్టుమీంచి జారిపడితే నడ్డి విరుగుతుంది. పైనుంచి కిందకుదూకితే పళ్ళు రాలిపోతాయి. పైనుంచి కిందకు దూకినా ఆనందమే - క్రిందనుంచి పైకెగిరినా ఆనందమే - వుయ్యాలలూగుతూంటే ఆనందంగా వుంటుంది. పైకి ఎక్కకుండా క్రింధకు జారకుండా ఏతప్పూ చేయకుండా, ఏవంకరా లేకుండా ఎవరూ జీవించలేరు. డబ్బుకో, పదవికో, పెదవికో, అధికారానికో దేనికొసమో ఓదానికి మనిషి ఎక్కుతూ, దిగుతూ, పడుతూ, లేస్తూ వుండాలి. చిన్నప్పుడు వుయ్యాలెక్కుతాం, తల్లీతండ్రి చంక ఎక్కుతాం. పెళ్ళిలో పల్లకీ ఎక్కుతాం. చివర్న అనంత శయనంమీద నిశ్చింతగా పడుకుని వెళ్ళివెళ్ళి చితిమీదకెక్కుతాం. సర్వపావకుడు మన్ని కాల్చుకుతింటాడు. అన్ని ప్రశ్నలకు సరయిన జవాబు మృత్యువు. చిత్రం ఏమిటంటే చాపమీద పడుకునేవాడు చచ్చిపోతున్నాడు. విమానంలో ఎగురుతున్నవాడు చచ్చిపోతున్నాడు. అణుబాంబులు చేసినవాడూ, చేయనివాడూ చచ్చిపోతున్నారు. చచ్చేదాకా జీవించాలి, తప్పదు. మెట్లు ఎక్కాలీ దిగాలీ తప్పదు. తలుపులు వేయాలి. కిటికీలు మూయాలి తెరవాలి, ఎందుకెందుకు ఎందుకు ఎవరైనా చెప్పగలరా? తెలుసనుకున్న వారికేమి తెలియదు. అంతా మిష్టరీ, అంతా కన్ఫ్యూషన్, అంతా న్యూసెన్స్. అంతా నాన్సెన్స్. మేడ మెట్లుక్కుతున్నప్పుడు ఈ మెట్లు ఎవరుకట్టారు అనిపిస్తుంది. ఎవరో ఒకరు - ఎందుకుకట్టారు - ఎక్కటానికి దిగటానికి, ఎందుకు ఎక్కడం దిగడం? మేడమీదవున్నాక మరి క్రిందకు దిగక్కర్లా... మేడమీద ఎందుకు వుండటం? క్రిందకువుండటానికి వీల్లేక... వుత్తమం వున్నతాసనం ఎత్తుమీద కూర్చున్న వాళ్ళంతా వుత్తములా - కోతులు చెట్లమీద వుంటాయి. అరణ్యాల్లో సింహాలూ, ఏనుగులు నేలమీద నడుస్తాయి. అమ్మఅప్పచ్చులు చేస్తుంది. నాన్నారు తింటారు. తినేవాడు గొప్పవాడా, చేసేవారు గొప్పవారా? ఏమో ఎవరికి తెలుసు?

మొన్న బొప్పాయి చెట్టుకి నిచ్చెన వేసివుంది. ఒక బొప్పాయి పండు అడుగున మగ్గి నన్ను చూసి నవ్వినట్లయింది. ఆ నిచ్చెన ఎక్కి ఆ పండుకోయాలని వంగాను. నిచ్చెన తిరగబడింది. కింద సిమెంటుకుండీలో పడ్డాను. మా వారొచ్చారు. "రెస్ట్ తీసుకుంటున్నావా" అన్నారు. "కనపడ్డం లేదా నిచ్చెన మీంచి పడ్డాను" అన్నాను. బొప్పాయి పండు కోయాలంటే ఎదురుగడతో పొడవలేక పోయావా అన్నారు. "ముందు నన్ను ఈ సిమెంటు కుండీలోంచి లేవతీస్తారా తియ్యరా" అన్నాను. "పురుషుల సహాయం లేకుండా స్త్రీలు పైకి రావాలనుకుంటే - అంతా యిలాగే అవుతుంది. ఇహ్హిహి" అని నవ్వారు. "డోంటాక్ రాట్" అన్నాను. కుండీలోనుంచి నన్ను లేవతీసి నువ్వు అచ్చం పంకజంలా వున్నావన్నారు. "మీరు పంకజనాభుడు కదా" అన్నాను. అన్నానేకాని సిమెంటు కుండీలో పడటం వలన ఏ పార్టు కాపార్టు

మండిపోతోంది. "హోసి ఇడియట్ - నిచ్చెన తిరగేసి వేశావే - ఏదీ మళ్ళీ ఎక్కు....నేను పట్టుగుంటాను. ఇందాక ఎల్లా పడ్డావో చూపించు" అన్నారు. "ఆల్‌రైట్ నిచ్చెన పట్టుకోండి" మళ్ళీ ఎక్కాను. పండుకోసి "ఇదుగోనండీ" అని వెనక్కు తిరిగి చూపించబోయాను. మళ్లీ చీర కాళ్ళకడ్డం పడింది. పడ్డాను. పడ్డం పడ్డం నిచ్చెన పట్టుగున్న శ్రీవారిమీద తాటిపండులా పడ్డాను. "చచ్చాన్" అన్నారు. స్త్రీలు పైకి వెళ్ల గూడదన్నారు గదా- యిప్పుడెలాగుంది? అన్నాను "వెలాసిటీ ఎక్కువగా వుందే" అన్నారు. స్త్రీల వెలాసిటీ ఎక్కువగానే వుంటుంది. భూదేవి కూడా స్త్రీయే కదా. స్త్రీదేవీ భూదేవీ కలుసుకునప్పుడు ఆ మాత్రం వెలాసిటీ వుండదా - "మీకేం ఫిజిక్సు తెలీదు. సైన్సూ తెలీదు" అన్నాను. ఇప్పుడిప్పుడే తెలుస్తోంది అన్నారు. దట్సాల్!

మా ఇంట్లో బొప్పాయి చెట్టూ లేదు. నిచ్చెనా లేదు. నేను సిమెంటు కుండీలోనూ పడలేదు. బొప్పాయి పండంటే నాకు చలా అసయ్యం. వూరిఖే రాశాను. స్త్రీల వెలాసిటీ తెలుసుకుని పురుషులు జాగ్రత్తపడడం అవసరమని - మెట్ల ఫిలాసఫీ కొద్దిగా రుచిచూస్తారనీ - మరేమోనె బొప్పాయి చెట్టు ఎక్కాలంటే ముందు క్రింద సిమెంటుకుండీ తీయించేయాలి నిచ్చెన తలక్రిందులుగా వేయకూడదు. బొప్పాయి పండు కోశాక "ఇదిగో నండీ" అని వెనక్కి తిరిగి నవ్వకూడదు. పళ్ళు రాలిపోయేలా క్రింద పడతారు. క్రింద పడితే ఫరవాలేదు. మీకెపాసిటీకి మీ వారు అణగారి పోతారు. మీ యింట్లో బొప్పాయి చెట్టు నిచ్చెనా రెండూ వుంటే ఏదో ఒకటి అమ్మేసెయ్యండి. ఎది అమ్ముతారు? బొప్పాయి చెట్టా? బలేవారే! నిచ్చెనే అమ్మేసెయ్యండి. (నిచ్చెనంటే ఏంబిషన్) ఏంబిషన్ లేకుండా ఎంత మంది జీవించటం లేదు. బైదిబై మీ ఇంట్లో బొప్పాయి చెట్టు ఉందా - లేదూ బ్రతికిపొయ్యారు. అయితే నిచ్చెన లేదా? నిచ్చెన ఎప్పుడూ ఎరువు తీసుకోకండి. ఎవరింటికేనా వెళ్ళి నిచ్చెన ఎక్కడం కంటె మనింట్లో వున్న నూతిలోకి దూకటం మంచిది. నా మాటలు మీకు బోధపడటం లేదా? ఇదంతా ప్యూర్‌ఫిలాసఫీ. ఫిలాసఫీ ఎప్పుడేనా ఎవడికేనా తిన్నగా బోధపడి ఏడిచిందా? లేదు. లేదు. అది అంతే - అది యాబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్.... యాబ్‌స్ట్రాక్ట్ రైటింగ్ మీకు బోధ పడ్డం లేదా ఓరమ్మ నేనేం జేతునే-ఓరయ్య నేనేంజేతునే...

# ప్రణయ వల్లకి పల్లకి....

**నా** చిన్నప్పుడు ఎక్కడకు వెళ్ళాల్సి వచ్చినా ఒంటెద్దు బండిమీద ప్రయాణాలు చేసే వాళ్ళం. మా వాళ్ళు పడవ ప్రయాణాలు కూడా చేసేవారు రాదారిబోటు అని వుండేది. అందులో చెక్క గదులుండేవి ఘోసా స్త్రీలు పడవ ప్రయాణం చేసేటప్పుడు ఆ చెక్కగదులకు తెరలు కట్టుకునే వారు. అందులోనే వంటా, భోజనాలు కూడా చేసేవారు. పడవ టాపుమీద